క్లుప్తంగా

60 మంది విద్యార్థుల రక్తదానం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం తలసేమియా బాధితుల సహాయార్థం సురక్ష బ్లడ్ బ్యాంక్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందు కొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తం అందించాలనే సదుద్దేశంతో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తలసేమియా వ్యాధి రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని పలు విభాగాధిపతులు, ఏఓ ప్రతాప్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డి. సుబ్బారావు, లైబ్రరీ హెడ్ సత్యకాంత్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కంకిపాడు: దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈడుపుగల్లు ఎంపీపీ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం మండవ శ్రీనివాస్ అన్నారు. అరమండల రోహిత్, మౌనికల కుమార్తె నిర్వాణ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. మండవ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాకుమారి, విశ్రాంత హెచ్ఎం శాంతకుమారి, దాతల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ ఉపాధి శిక్షణ ప్రారంభం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు బహుళజాతి సంస్థ ఇన్ఫోసిస్, ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు సీఎస్ఈ, ఏఐ ఎంఎల్, ఈజీఈ, ఐటీ కి చెందిన 65 మందికి శిక్షణ ఇస్తున్నారన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా పలు కాలేజీల్లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. తమ కాలేజీలో 65 మంది విద్యార్థులకు ఉపాధి శిక్షణకు అవకాశం లభించిందన్నారు. ఐసీటీ అకాడమీ మేనేజర్ దినేష్ మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. దాడిలో ఇద్దరు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.41,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

రామవరప్పాడు: ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పటమట పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమానూరుకు చెందిన బాషా ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతని ఇంటి సమీపంలో నివసిస్తున్న బాలిక (17)ను పరిచయం చేసుకుని ప్రేమ పేరుతో వలలో వేసుకున్నాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. కాగా ఈనెల 9న అర్ధరాత్రి బాలిక ఇంట్లోకి చొరపడి బాషా అత్యాచారం చేయబోతుండగా బాలిక తండ్రి పట్టుకున్నాడు. దీంతో బాలికను నిలదీయగా తనను బెదిరించి గత 6 నెలలుగా అత్యాచారం చేస్తున్నట్లు తెలిపింది. బాలిక తండ్రి పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా బాషాపై పోక్సో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామ బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. రామవరప్పాడు గ్రామానికి చెందిన మందల సాయి(26)ఈ నెల 11వ తేదీన అడవినెక్కలానికి బైక్‌పై వెళ్తుండగా నున్న గ్రామ బైపాస్ రోడ్డులో నయార పెట్రోల్ బంకు వద్ద బండి స్కిడ్ అయ్యింది. దీంతో సాయి కిందపడటంతో మోచేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. పోరంకిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుని బాపులపాడు మండలంలో 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వేలేరు, రంగన్నగూడెం, పెరికీడు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు తిరంగా జెండాలను చేబూని భారీ ప్రదర్శన నిర్వహించారు. రంగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు 78 అడుగుల పొడవైన భారీ త్రివర్ణపతాకాన్ని తయారు చేసి దేశభక్తిని చాటుకున్నారు. గ్రామంలో భారీ జాతీయ జెండాతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. వేలేరు, పెరికీడు గ్రామాల్లోనూ మువ్వెన్నెల జెండాలతో ర్యాలీ చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ, జనసేన నాయకులు



ఉయ్యూరులో త్రివర్ణపతాకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు నూకల, ఇస్మాయిల్

త్రివర్ణ పతాకాల పంపిణీ

ఉయ్యూరు: స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మహనీయుల త్యాగాలను గుర్తెరిగి సమాజ నిర్మాణంలో ముందుకు సాగాలని లయన్స్ జిల్లా కేబినెట్ సంయుక్త కార్యదర్శి నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జయహో భారత్ తిరంగా ప్రదర్శన బుధవారం నిర్వహించారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ పతాకాలు చేతబట్టి స్వాతంత్రోద్యమ స్ఫూర్తి చాటుతూ నినాదాలు చేశారు. చిరు వ్యాపారులు, పట్టణ వాసులకు జాతీయ జెండాలను అందించారు. నూకల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయాలన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఎండి ఇస్మాయిల్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, నల్లా శ్రీనివాస్, ఎం.నాంచారయ్య, హసన్ అహ్మద్, జెడ్పీ పాఠశాల హెచ్ఎం సుమంత్, ఎన్‌సీసీ ఆఫీసర్ జీవీ రమణ, ఎస్ఎంసీ చైర్మన్ ఆరేపల్లి శివసాయిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నున్న(విజయవాడరూరల్): స్వాతంత్ర్యదినోత్సవం నేపథ్యంలో బుధవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, గ్రూఫ్ డిస్కషన్ పోటీలను నిర్వహించారు. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోటీలను నిర్వహించాల్సి ఉండగా నున్న గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్‌లో మాత్రమే పోటీలు జరిగాయి. గ్రామ సచివాలయ సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి, డ్వాక్రా గ్రూపు సభ్యులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను నిర్వహించడానికి ఐదు వేల జనాభా పైబడిన గ్రామాలకు రూ.25 వేలు, ఐదు వేల లోపు జనాభాగల గ్రామాలకు రూ.10 వేల వంతున ప్రభుత్వం మంజూరు చేసినట్లు నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించండి

జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



పెదపులిపాకలో రైతులకు సూచనలు ఇస్తున్న పద్మావతి

పెనమలూరు: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవపసాయాధికారి ఎస్.పద్మావతి అన్నారు. పెదపులిపాక గ్రామంలో బుధవారం రైతులకు పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించేందుకు, పంటలకు చీడపీడల ఉధృతి తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పొలం గట్లపై ఎరపంటలు, రక్షక పంటలు వేయటం వలన చీడపీడల ఉధృతి తగ్గించటమే కాకుండా అదనపు ఆదాయం రైతులకు చేకూరుతుందన్నారు. విత్తన శుద్ధి చేసుకోవటం వలన అగ్గి తెగులు, పొడతెగులు నివారించవచ్చన్నారు. నారు కొనలను తుంచి నాటడం వలన కూడా కాండం తొలిచే పురుగు నివారించగలుగుతామని తెలిపారు. రైతులతో కలిసి పొలం గట్లపై బంతి నారు, కంది విత్తనాలు వేశారు. వీటి వలన ఆకు చుట్టు పురుగు ఉధృతి తగ్గించవచ్చని వివరించారు. రైతులు రసాయ ఎరువులు, క్రిమిసంహారక మందులు సిఫార్సుల మేరకు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, పది గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలంబడి కార్యక్రమం జరిగింది. ఎంఏవో ఎన్ఎల్ తేజశ్వి పాల్గొని మాట్లాడుతూ రైతులను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో రైతులు భాగస్వాములు కావాలన్నారు. పంట భూములను రసాయనిక ఎరువుల బారి నుంచి రక్షించుకోవటం ముఖ్యమన్నారు. పంటలకు మేలు చేసే కీటకాలను, సూక్ష్మ క్రిములను రక్షించాలన్నారు. రైతాంగం నిర్దిష్ట ప్రణాళికలతో ఆలోచనలు చేసి వాటిని పంచుకోవటం ద్వారా ఆర్థికంగా బలపడేందుకు పొలంబడి ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు పరస్పర అభిప్రాయాలు, అనుభవాలు పంచుకునేందుకు, సాంకేతిక పద్ధతులతో సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. గ్రామానికి చెందిన రవి పొలంలో పొలంబడి నిర్వహించారు. గ్రామరైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

పెనమలూరు: విద్యార్థులు వృత్తి పరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలని టీఎల్ఎంఈలో శిక్షకుడు త్రిలోచన్‌రావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో బుధవారం బీటెక్, ఎంబీఏ, ఎంఈఏ విద్యార్థులకు స్పీడ్ రీడింగ్ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రిలోచన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు విద్య, వృత్తి పరమైన నైపుణ్యం పెంపొందించు కోవాలన్నారు. చదువుకునే సమయంలోనే పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యం సాధించగలిగితే ఉద్యోగాల్లో రాణించగలుగుతారని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎస్ఆర్‌కే.మూర్తి, కన్వీనర్లు బీ నీలాంబరం, కె.స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న శిక్షకుడు త్రిలోచన్‌రావు

వైద్య విద్యార్థిని కేసులో నిందితులను శిక్షించండి

గన్నవరం రూరల్: కోల్‌కతాలో అఘాయిత్యానికి బలైన వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థినికి న్యాయం చేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల విద్యార్థులు, డాక్టర్లు బుధవారం ఈ మేరకు ప్రదర్శన నిర్వహించారు. పీజీ విద్యార్థిని హత్య, అత్యాచారం ఉదంతంలో నిజమైన నిందితులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని నినాదాలు చేశారు. డాక్టర్‌లు ప్రాణాలు నిలబెట్టే వారని, సేవ్ ఉమెన్, సేవ్ డాక్టర్స్, సేవ్ నేషన్ అంటూ ప్లకార్డులు చేతబట్టి నినదించారు. ఉన్నత విద్యావంతులైన డాక్టర్‌లకు రక్షణ లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ మెడికల్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, పరిసరాలపై సమగ్ర విచారణ జరగాలని ఆకాంక్షించారు. అప్పుడే నిజాలు బయటకు వస్తాయన్నారు. వైద్య విద్యార్థులు వందల సంఖ్యలో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.



మెడికల్ కళాశాలలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు, డాక్టర్‌లు

రూరల్ ఎంపీడీవోగా భార్గవి బాధ్యతల స్వీకరణ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.భార్గవి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో రూరల్ మండలం నుంచి దుగ్గిరాల మండలానికి బదిలీపై వెళ్లిన భార్గవి తిరిగి విజయవాడ రూరల్ ఎంపీడీఓగా ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బీఎల్వీ శేషగిరిరావు ఎన్టీఆర్ జిల్లా డ్వామా కార్యాలయంలో డెప్యూటీ స్టాటిస్టికల్ అధికారిగా ప్రభుత్వం బదిలీ చేసింది. సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న కుమారస్వామిరెడ్డిని డ్వామా కార్యాలయానికి బదిలీ చేస్తూ ఆదేశాలు వచ్చాయి.

సీఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీవీఎన్ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడగా సీఐగా విధులు నిర్వర్తిస్తున్న అల్లు నవీన్ నరసింహమూర్తిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆర్.గంగాధరరావు ఉత్తర్వులు జారీ చేయటంతో నూతన సీఐగా కేవీవీఎన్ సత్యనారాయణ నియమితులయ్యారు. దీంతో ఆయన ప్రస్తుత సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి నుంచి బాధ్యతలు చేపట్టారు. తొలుత అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

యువత విజయాలు సాధించాలి

పెనమలూరు: 'యువ ఫ్యూచర్ 4.0'తోయువత విజయాలు సాధించవచ్చని వైఐ అమరావతి చాప్టర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భవన్‌చంద్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫ్యూచర్ '4.0పై హమ్ బిల్డింగ్ భారత్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భావన్‌చంద్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలితో లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. ఐటీ హెడ్ సునీత మాట్లాడుతూ విద్యార్థుల్లో అనేక అంశాలపై అవగాహన కల్పిచటానికి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రధానంగా మాదకద్రవ్యాలకు దూరంగా విద్యార్థులు ఉండి క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగలుగుతారని వివరించారు. ఫ్యూచర్ 4.0తో యువత శక్తివంతంగా ఎదుగుతారని అన్నారు. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు వైఐ అమరావతి చాప్టర్ కృషి చేస్తుందని తెలిపారు. ప్రముఖులు శ్రీహరికృష్ణ, చిట్టినేని బాలకృష్ణ, మొవ్వా సత్యప్రసాద్, చందాన చాందిని, విద్యార్థులు పాల్గొన్నారు.



కానూరులో సదస్సులో పాల్గొన్న డాక్టర్ భవనచంద్, ఐటీ హెచ్‌వోడీ సునీత


'ప్రాజెక్టు కామథేను' ప్లాంట్ సందర్శన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో కృష్ణామిల్క్ యూనియన్ నిర్మించిన 'ప్రాజెక్టు కామథేను' ప్లాంట్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్ బోర్డు డైరెక్టర్ సతీష్ కాశీనాథ్ మరాఠే బుధవారం సందర్శించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అత్యాధునిక సాంకేతికత, పూర్తి ఆటోమిషన్ సదుపాయాలతో ఏర్పాటు చేసిన పాలు, పాల ఉత్పత్తుల కార్మాగారాన్ని సతీష్ కాశీనాథ్ మరాఠే బృందం పరిశీలించింది. విజయవంతంగా అభివృద్ధిపథంలో నడుస్తున్న సహకార పాల ఉత్పత్తుదారుల సమితిని అభినందించారు. పాడి రైతుల సంక్షేమం, అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలను చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆయనకు వివరించారు. సహకార, బ్యాంకింగ్ రంగంలో విశేష అనుభవం కలిగిన సతీష్ కాశీనాథ్ మరాఠే స్వయంగా విచ్చేయటం, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యక్రమాలను అభినందించటం ఆనందంగా ఉందన్నారు. యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా బోర్డు డైరెక్టర్ పల్లగాని కొండలరావు, సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆడూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్బీఐ సీబీ డైరెక్టర్ కాశీనాథ్ మరాఠేను సత్కరిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

విమానాశ్రయం త్రివర్ణ శోభితం



స్వాతంత్ర్య వేడుకలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) ముస్తాబైంది. ఎయిర్‌పోర్ట్‌లోని డొమెస్టిక్ టెర్మినల్‌ను మువ్వన్నెల జెండా రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. టెర్మినల్ ఆవరణలోని గార్డెన్‌ను కూడా ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాక రంగుల బెల్లూన్లు, రంగవల్లికలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. -గన్నవరం

రూరల్ ఎస్ఐగా సురేష్‌బాబు



ఉయ్యూరు: ఉయ్యూరు రూరల్ ఎస్ఐగా కె.సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన అవినాష్ పామర్రు మండలానికి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో కోనసీమ జిల్లా రామచంద్రాపురం ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్‌బాబును ఉయ్యూరు రూరల్‌కు బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

స్వాతంత్ర్య దినోత్సవంపై అవగాహన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని వివేకానంద కాన్సెప్ట్ స్కూల్‌లో బుధవారం హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా విభజన భయానక దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1947 ఆగస్టు 14న జరిగిన మారణహోమం గురించి బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి విద్యార్థులకు వివరించారు. దేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్క విద్యార్థి స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తమ ఇంటిపైన జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి సదాశివరావు, వివేకానంద స్కూల్ ప్రిన్సిపాల్ బొప్పన హరికృష్ణ, లఖమరాజు మల్లికార్జున రాజు, నాదెండ్ల మోహన్, గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కురుమద్దాలి ఫలికుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

ఉయ్యూరు: ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా రీసోర్సు పర్సన్ పి.లక్ష్మణనాయక్ అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్‌స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని కలవపాముల, ముదునూరు గ్రామాల్లో 'మీకు తెలుసా' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో హెచ్ఐవీపై అవగాహన సదస్సులు, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.రాకేష్, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఫ్లెక్టైవర్ వద్ద డ్రెయినేజీ నిర్మించేందుకు ఎమ్మెల్యే బోడెప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ నిధులు దాదాపు రూ.2.35 కోట్లతో పోలీస్‌స్టేషన్ నుంచి వంద అడుగుల రోడ్డు వరకు ఇరు పక్కలా డ్రెయినేజీ నిర్మాణం చేస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా డ్రెయినేజీ పనులు పూర్తిచేస్తామని అన్నారు. ఫ్లెక్టైవర్ పనులు పూర్తి చేసే విధంగా కాలేజీ యాజమాన్యంతో మాట్లాడుతానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డీసీ బావినేని పాండురంగారావు, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, నర్రాచంటి, వెలగపూడి శంకర్‌బాబు, అంగిరేకుల మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: కానూరు బల్లెంవారి వీధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలవడంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌కు చెందిన కె.ప్రదీప్ వంట పని చేస్తాడు. అతని మిత్రుడు టి.ప్రవీణ్‌తోల కలిసి బైక్‌పై రామవరప్పాడు నుంచి బల్లెవారివీధి మీదగా మురళీనగర్ వస్తుండగా ఆరెంజ్ ట్రావెల్స్ దాటుతున్న సమయంలో పక్క వీధిలో నుంచి మరో బైక్ వచ్చి వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ప్రదీప్, ప్రవీణ్‌లకు గాయాలయ్యాయి. వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉంగుటూరు: ఎరువులు, మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్‌కుమార్ హెచ్చరించారు. తేలప్రోలులో పీఏసీఎస్, ఆత్కూరు, పొట్టిపాడు, పెద్ద అవుటపల్లి గ్రామాల్లోని ప్రైవేటు దుకాణలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరి రసీదు ఇవ్వాలని అన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేయాలని సూచించారు. గోడౌన్‌లలో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఈపోస్ మిషన్లు తనిఖీ చేశారు. పీఏసీఎస్, ప్రైవేటు డీలర్స్ వద్ద సరిపడా ఎరువులు నిల్వ ఉంచామన్నారు. ఏఈవో దుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాబోయే రోజుల్లో లాజిస్టిక్స్ రంగంలో పెనుమార్పులు చోటుచేసుకుంటాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బాపులపాడు మండలం అంపాపురంలో కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు బుధవారం ఆయన చేతుల మీదగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉపాధికల్పన అవకాశాలను మెరుగు పర్చటమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కేశినేని చిన్ని చెప్పారు. కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు చలపతిరావు, సత్యనారాయణరాజు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖర్, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, లారీ ఓనర్స్ ఫౌండేషన్‌అధ్యక్షుడు కె.వి.రామారావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ మాధవీలత అన్నారు. బుధవారం నున్న గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మాధవీలత మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వలన భూమి సారం పెంచవచ్చన్నారు. తద్వారా సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందుతాయని, ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. ఏడీ మోనీషా, ఏఓ బి.రంగనాథ్‌బాబు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటన చేశారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఉంగుటూరు: ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ మెగా క్యాంపెయిన్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. దీంతో కళాశాల విద్యార్థులు పొట్టిపాడు గ్రామంలో ప్రతి ఇంటి ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను తల్లి పేరుతో నాటారు. మొక్కలను సంరక్షించుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మాంసం అమ్మకాలు నిషేధం

పెనమలూరు: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ మాంసం విక్రయాలను మున్సిపాలిటీ పరిధిలో నిషేధించామని వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ ఆగస్టు 15వ తేదీ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని చికెన్ , మటన్ షాపులు, చేపల మార్కెట్‌లకు సెలవు ప్రకటించామన్నారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

పెనమలూరు ఎంపీడీవోగా సునీతాశర్మ



పెనమలూరు: పెనమలూరు ఎంపీడీవోగా సునీతాశర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గుంటూరు జిల్లా పెదనందిపాడు నుంచి బదిలీపై పెనమలూరుకు వచ్చారు. గతంలో సునీతాశర్మ పెనమలూరు ఎంపీడీవోగా పని చేశారు. ఎన్నికల నిబంధనల కారణంగా ఆమె పెదనందిపాడుకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో సునీతాశర్మను ఏవో లోయ శివశంకరరావు, మండల పరిషత్ సిబ్బంది సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

విజయవాడరూరల్: పేదల ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని మండల ప్రత్యేక అధికారి డీవీ రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నున్న, పాతపాడు, ఈలప్రోలు లేఅవుట్లల్లో గృహ నిర్మాణాలు జరగడం లేదని, వాటిలో ప్రోగ్రెస్ లేదని గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకొని నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ సంస్థ ఏఈ సర్వేశ్వర్ నాయక్‌ను ఆదేశించారు. 5 నుంచి 17 ఏళ్ల లోపు పిల్లలు డ్రాపౌట్స్‌గా ఉండటానికి వీల్లేదని ప్రభుత్వ ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని ఎంఈఓలు ఎ.వెంకటరత్నం, ఎ.సూరిబాబులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, తహసీల్దార్ బి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



పెనమలూరు: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పెనమలూరు గ్రామంలో హర్ రంగ్ తిరంగా అభియాన్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ర్యాలీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అందరు స్వేచ్ఛగా ఉంటూ రాజ్యాంగం నుంచి సంక్రమించిన హక్కులు వినియోగించుకుంటున్నామన్నారు. అనుమోలు ప్రభాకరరావు, ముప్పా రాజా, యేకుల విజయేంద్ర, హెచ్ఎం వై.దుర్గాభవాని, మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జంక్షన్‌లో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి భాస్కర్ గణేష్, యువమోర్చా జిల్లా కార్యదర్శి నాగ శ్రీనివాస్ నాయుడు, జనసేన గన్నవరం సమన్వయకర్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలపై తీర్మానం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పంచాయతీ నిధులతో నిర్మించే సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు టెక్నికల్ అనుమతులు కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. నున్న సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామంలో పలు ప్రాంతాల్లో రూ.55 లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్లు, రూ.32లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణాలకు సాంకేతిక అనుమతులు కోరారు. ఇవి కాక గ్రామంలో నిర్మించబోయే 12 సిమెంటు రోడ్ల నిర్మాణాలకు, 10 డ్రైన్ల ప్రతిపాదనలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, సభ్యులు యర్కారెడ్డి వెంకటరెడ్డి, కాటూరి శ్రీనివాసరావు, దాసరి కిరణ్, బొట్టా అరుణ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయమందించాలి

ఉంగుటూరు: రోడ్డు ప్రమాదబాధితులకు సాయమందించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణ స్వామి అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత సూచనలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్‌కు కావల్సిన అర్హతలు, రోడ్ సేఫ్టీ గుర్తులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్కూరు ఎస్ఐ సురేష్, ప్రిన్సిపాల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వెంటాడుతున్న చెత్త సమస్య

- గన్నవరంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు
- డంపింగ్‌యార్డు లేదు



గన్నవరంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామపంచాయతీని చెత్త సమస్య వెంటాడుతోంది. సుమారు 30 వేల జనాభా కలిగిన పంచాయతీకి ఇప్పటి వరకు శాశ్వత డంపింగ్ యార్డు లేదు. ఫలితంగా గ్రామంలో సేకరించిన టన్నుల కొద్దీ చెత్తను స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు రెండు వైపులా డంప్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో రోజురోజుకు చెత్త నిల్వలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. చెత్త నిర్వహణ, తరలింపు పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. పక్కనే ఉన్న కేసరపల్లి, బుద్దవరం గ్రామ పంచాయతీలను కూడా డంపింగ్ యార్డు సమస్య వేధిస్తోంది.

రోజుకు పది టన్నుల చెత్త

పట్టణీకరణను సంతరించుకుంటున్న గన్నవరం గ్రామం వేగంగా విస్తరిస్తోంది. పంచాయతీకి చెందిన రెండు ట్రాక్టర్ల ద్వారా నివాస, వ్యాపార సముదాయాల నుంచి కార్మికులు రోజుకు పది టన్నుల వరకు చెత్తను సేకరిస్తున్నారు. గతంలో ఈ చెత్తను గ్రామానికి 12 కిలోమీటర్లు దూరంలో ఉన్న గొల్లనపల్లి శివారుల్లో డంప్ చేసేవారు. ఆ ప్రాంత రైతులు చెత్త డంపింగ్‌ను అడ్డుకోవడంతో సమస్య జటిలమైంది. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తను తప్పనిసరి పరిస్థితుల్లో కోనాయి చెరువు వద్ద డంప్ చేస్తున్నారు. ఇక్కడ పెద్ద ఎత్తున్న చెత్త నిల్వలు పేరుకుపోయి ఆర్అండ్‌బీ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఇక్కడి చెత్త నిల్వలను బయటకు తరలించడానికి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ నిధులు రూ. 25 లక్షల వరకు ఖర్చు చేసిన ఫలితం లేకుండా పోయింది.

సమస్య మొదటికి

డీపీఓ చొరవతో విజయవాడ మున్సిపల్ వాహనం ద్వారా గ్రామంలో సేకరించిన చెత్తను గుంటూరు జిందాల్‌కు తరలించే ప్రక్రియ కూడా కొన్ని నెలలకే పరిమితమైంది. దీంతో తిరిగి ఇదే ప్రాంతంలో చెత్తను డంపింగ్ చేస్తుండటంతో సమస్య మొదటికి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో తీవ్ర అపరిశుభ్రత నెలకొని దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇటుగా రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. దీనికితోడు చెత్త నిల్వలకు నిప్పు పెడుతుండటంతో పొగ కారణంగా రాత్రి వేళలో మార్గం కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు చెత్త తరలింపుపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక భరోసాకు న్యాయస్థానాల కృషి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పి.రాజారాం

కంకిపాడు: మహిళల ఆర్థిక భరోసాకు న్యాయస్థానాలు కృషి చేస్తున్నాయని ఐదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారాం అన్నారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పి.రాజారాం మాట్లాడుతూ ప్రభుత్వాల నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం పొందడానికి మహిళలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తే ఉచితంగా న్యాయ సాయం లభిస్తుందన్నారు. ఆర్థిక భరోసా, భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. సదస్సులో సర్పంచ్ బాకీ రమణ, న్యాయవాదులు కె.శివయ్య, పి.రాము, పీఎల్‌యూలు సీహెచ్ సుబ్బారావు, జెలిమ్మ, ప్రభావతి, మాజీ సర్పంచ్ వజ్రకుమారి, పంచాయతీ కార్యదర్శి ఓ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు



విద్యార్థులకు పోటీలు నిర్వహించిన ఉపాధ్యాయుల బృందం

రామవరప్పాడు: స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బయోడైవర్సిటీ బోర్డు, పాఠశాల విద్యా శాఖ, ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయిలో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. వీటిలో భాగంగా 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ బయోడైవర్సిటీ కన్సర్వేషన్' అంశంపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఆగస్టు 15న జిల్లా కేంద్రంలో జరగబోయే వేడుకల్లో కలెక్టర్, జిల్లా విజేతలకు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. పాఠశాల హెచ్ఎం తాయారు, ఏపీఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ మంజుల, క్లస్టర్ కో ఆర్డినేటర్ సాయి రున్నీసా బేగం, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలా.. దోమల ఉత్పత్తి కేంద్రాలా!



కంకిపాడు ఐసీడీఎస్ కార్యాలయం చుట్టూ నిలిచిన వర్షం నీరు



కంకిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద..

కంకిపాడులోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కార్యాలయాల పరిసరాలు పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షం పడినా నీళ్లు నిలిచిపోతున్నాయి. వీటిలో మురుగునీరు కలిసిపోవడం.. రోజుల తరబడి నీళ్లు కదలకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా ప్రాంగణాలు మారుతున్నాయి. దీంతోపాటు దుర్గంధం కూడా వెదజల్లుతోంది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణాల్లో వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి. మండల స్థాయిలో అనేక మంది అధికారులు నిత్యం ఈ కార్యాలయాలకు వస్తుంటారు. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రజల పాలిట శాపంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది. -కంకిపాడు

కాల్వకట్టపై రైతుబజార్‌కు సన్నాహాలు!

- మళ్లీ పనులు మొదలు
- శాశ్వత పరిష్కారానికి చర్యలేవీ



తాడిగడప వద్ద ఇరిగేషన్ కట్టపై రైతుబజార్ ఏర్పాటు పనులు చేస్తున్న దృశ్యం



కానూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఫుట్‌పాత్‌పై రైతుబజార్

పెనమలూరు: మండల పరిధిలో రైతుబజార్ ఏర్పాటుకు మళ్లీ పనులు మొదలు పెట్టారు. తాడిగడప వద్ద ఇరిగేషన్ కాల్వ కట్టపై రైతుబజార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపే విషయంలో పాలకులు, అధికారులు మరోసారి విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో ఇప్పటివరకు రైతుబజార్ లేదు. తాజా కూరగాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేయాలంటే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంకిపాడు రైతుబజార్‌కు లేదా 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న పటమట రైతుబజార్‌కు వెళ్లాల్సి వస్తుంది. కరోనా సమయంలో కూరగాయల సమస్య రావడంతో కానూరు ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో తాత్కాలిక రైతుబజార్‌ను అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతంలో శాశ్వతంగా రైతుబజార్ ఏర్పాటుకు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు కేటాయించింది. కానూరులో రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థలం పరిశీలించగా స్థానికులు అభ్యంతరం తెలపడంతో పనులు ముందుకు సాగలేదు. అయితే కాలేజీ యాజమాన్యం కొద్ది నెలల క్రితం కాలేజీలో రైతుబజార్ ఖాళీ చేయించడంతో కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌పై రైతుబజార్ ఏర్పాటు చేశారు. అయితే పూర్తి స్థాయిలో కూరగాయలు అందడం లేదు. రేట్లపై కూడా నియంత్రణ లేకుండా ఉంది.

ఇప్పుడూ అదే సమస్య

రైతుబజార్ శాశ్వతంగా ఏర్పాటు చేసే విషయంలో ప్రస్తుత పాలకులు విఫలమయ్యారు. రైతుబజార్‌ను ఇరిగేషన్ కాల్వకట్టపై ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయించి పనులు మొదలు పెట్టి ఆలోచన విరమించారు. జాతీయ రహదారి పక్కనే రైతుబజార్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరుగుతాయని, శాశ్వతంగా మరో ప్రాంతంలో నిర్మించాలని నిర్ణయించి చేపట్టిన పనులు ఆపారు. నెల రోజులు గడిచిన తర్వాత మళ్లీ ఇరిగేషన్ కట్ట పైనే రైతుబజార్ ఏర్పాటు చేయటానికి నిర్ణయించి పనులు మళ్లీ ప్రారంభించారు. రైతుబజార్ సమస్య శాశ్వతంగా పరిష్కరించటానికి అనువైన స్థలాన్ని పాలకులు సేకరించలేక పోయారు. జాతీయ రహదారి పక్కనే, ఇరిగేషన్ కాల్వకట్టపై రైతుబజార్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి చెప్పారు. రూరల్ మండలం రామవరప్పాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'నిషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు కాస్తా జీవితాలను చిన్నాభిన్నం చేసేవరకూ వదలి పెట్టదని విద్యార్థులకు అవగాహన పరిచారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి విద్యార్థులు ముందు వరుసలో నిలబడి మార్పు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు చామర్తి వెంకట కృష్ణారావు (బొమ్ములూరు) సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అనధికార లే అవుట్లలో విద్యుత్ సర్వీసుల తనిఖీ

ఉయ్యూరు: అనధికార లే అవుట్లలో విద్యుత్ సర్వీసులపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ అన్నారు. మండలంలోని గండిగుంట పంచాయతీ పరిధిలో అనధికార లే అవుట్లలో విద్యుత్ సర్వీసులు ఇవ్వడంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

దీనిపై చర్యలు తీసుకోవడానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్, డీఈ రామకృష్ణ, ఏఈ నాగమల్లేశ్వరరావు సిబ్బందితో మంగళవారం రాత్రి గండిగుంటలోని అనధికార లే అవుట్లను తనిఖీ చేశారు. ఐదు లే అవుట్లను పరిశీలించి రెండింటిలో విద్యుత్ సర్వీసులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని తనిఖీ చేసి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని, చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

స్వర్ణభారత్‌లో పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో పలు స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ పి.మల్లికార్జున్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి 18–45 ఏళ్ల వయసు ఉన్నవారు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల గ్రామీణ యువత అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 63042 54730 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ



మాట్లాడుతున్న సీఐ జె.మురళీకృష్ణ, పక్కన ఎస్ఐ డి.సందీప్

కంకిపాడు: శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యమని కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళీకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందేల నియంత్రణకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వీటి మూలాలను ఛేదించి రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలల సముదాయాల వద్ద ఈవ్‌టీజింగ్ జరగకుండా పటిష్ట నిఘా ఉంచుతామన్నారు. బెల్టుషాపులను నిరోధిస్తామని చెప్పారు. అక్రమ మద్యం వ్యాపారాలను అడ్డుకుంటామన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి

పెండింగ్ కేసులు, కేసుల దర్యాప్తును సమర్థంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని సీఐ మురళీకృష్ణ అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం ఇవ్వబోమని, ప్రజలు సమాచారం అందించాలని, నేరాల నిరోధంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్ఐ డి.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు



బస్‌పాస్‌లు అందుకున్న విద్యార్థులతో రమణ, కిషోర్

గన్నవరం: పేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, కేవీఆర్ కిషోర్ పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో చదువుతున్న వంద మంది దూర ప్రాంత విద్యార్థులకు మంగళవారం కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణ, కిషోర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడలు, చదువులకు సంఘం చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 500 మంది దూర ప్రాంత విద్యార్థులకు గత మూడేళ్లుగా ఉచిత బస్‌పాస్‌లను అందజేస్తున్నట్లు చెప్పారు. బస్‌పాస్‌లు జారీ నిమిత్తం విద్యార్థులు చెల్లించాల్సిన రూ. 30 వేలు తమ అసోసియేషన్ ద్వారా ఏటా ఆర్టీసీకి చెల్లిస్తున్నట్లు వివరించారు. రోటరీక్లబ్ అధ్యక్షులు టీఎస్ఆర్‌కె. ప్రసాద్ మాట్లాడుతూ...సమాజాభివృద్ధిలో విద్య కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం కిషోర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం మోహిని కృష్ణకుమారి, అసోసియేషన్ సభ్యులు నిడమర్తి బుజ్జారావు, చిల్లపల్లి శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయులు నాగరాజు, ఎస్‌కే మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో విప్లవాత్మక మార్పులు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ చెన్నుపాటి సురేష్

రామవరప్పాడు: ఔషధ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని డాక్టర్ చెన్నుపాటి సురేష్ అన్నారు. రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో 'ప్రపంచం దృష్టిలో ఔషధ రంగంలో కృత్రిమ మేధస్సు ' అంశంపై మంగళవారం విజయ ఫార్మసీ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఎక్కువగా ప్రపంచ దేశాలతో పాటు మన దేశం కూడా సమర్థంగా వినియోగిస్తోందన్నారు. కృత్రిమ మేధస్సును ఔషధ తయారీ విధానానికి, వినియోగదారుల భద్రత పెంచడానికి, ఔషధాల మధ్య జరిగే చర్యలను నివారించడానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నూతన పరిశోధనలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అమెరికా నుంచి అంతర్జాలంలో డాక్టర్ గౌరవ్ గుప్తా, డాక్టర్ మిశ్రా, డాక్టర్ కుంతల్ దాస్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మలత, కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే ప్రసాద్‌కు మొక్క ఇస్తున్న డీఎస్పీ చలసాని

పెనమలూరు: పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్‌ను గన్నవరం డివిజన్ డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు ఎమ్మెల్యే ప్రసాద్‌ను కలిసి మొక్కను అందజేశారు. గతంలో డీఎస్పీగా పని చేసిన జయసూర్య భీమవరానికి బదిలీ అవ్వగా ఆయన స్థానంలో శ్రీనివాసరావు వచ్చారు.

గన్నవరం: గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చలసాని శ్రీనివాసరావును మంగళవారం సబ్‌రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీకి ఆయన మొక్కను అందజేసి శుభకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీఎస్పీతో సమావేశమై శాఖ పరమైన అంశాలపై చర్చించారు.

అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులు దూరం

గన్నవరం రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని 104 వాహన వైద్య సేవల డాక్టర్ సంధ్య సూచించారు. మంగళవారం మండలంలోని మాదలవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు దోమల ఉధృతికి కారణమవుతున్నాయని, వాటిని నివారించడానికి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దీర్ఘకాల రోగులు వైద్యులు సూచించినట్లు మందులు వాడాలని చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. సీహెచ్‌వో సింధూర, ఎంఎల్‌హెచ్‌పి సాంబశివరావు, ఏఎన్ఎం మేరీ గ్రేస్, ఆశాలు సేవల్లో పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

70 మద్యం సీసాలు స్వాధీనం

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలవెన్ను గ్రామంలో తనిఖీలు చేశారు. వీటిలో భాగంగా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడనే అనుమానంతో పరిసె రమేష్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 70 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రమేష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ బెల్టు షాపు నిర్వహణ, అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, బెల్టు షాపులను పూర్తి స్థాయిలో నిరోధించడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కోతముక్క ఆడుతున్న ఆరుగురి అరెస్టు

పెనమలూరు: గోసాలలో కోతముక్క ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గోసాల వైకుంఠపురం ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ తిరుగుతున్న సమయంలో ఆరుగురు వ్యక్తులు కోతముక్క ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 15,210 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలి



ప్రభుత్వాస్పత్రిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ మురళి

ఉయ్యూరు: అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.మురళి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో అవయవదానం ఆవశ్యకతను వివరిస్తూ అవగాహన పెంపొందించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి మాట్లాడుతూ రక్తదానం, అవయవదానంతో ప్రాణదాతలు కావచ్చన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు, జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, నల్లా శ్రీనివాస్, హసన్ అహ్మద్, రమణమూర్తి పాల్గొన్నారు.